


విజయవాడ నాకు కొత్తేమీ కాదు. ఆఫీసు పనిమీద ఒక సారి, దగ్గర బంధువు ఒకాయన పెళ్లికి మరోసారి వచ్చి వెళ్లాను. అప్పట్లో విజయవాడ నా కేమంత ప్రత్యేకంగా కనిపించలేదు. నిజానికి అప్పటికీ ఇప్పటికీ చెప్పుకోదగ్గ మార్పులేవీ జరగలేదు. అయినా ఏదో చెప్పలేని కొత్తదనం మాత్రం కనిపిస్తుంది ఈసారి!

విజయవాడ వీధుల్లో నడుస్తున్న నాకు ఆ రాత్రి ఎంతో హాయిగా వుంది. నాలో నిండుకున్న ఆనందం బయటకు వురికి గంతులేద్దామా అన్నంతలా వుంది. చల్లగా వీస్తున్న చలిగాలి ప్రియురాలి స్పర్శ అన్నా వెచ్చగా వుంది. కునికిపాట్లు పడుతున్న మునిసిపాలిటీ దీపాలు పారిస్ వంటి అందమైన నగరాలను అలంకరించే మెర్క్యూరీ లైట్లలా వున్నాయి. అలిసి అలిసి నిద్రపోతున్నట్టు వున్న విజయవాడ నగరం కొత్తకొత్త అందాలను సృష్టించుకుని వెన్నెల్లో విహరిస్తున్న రాకుమారిలా వుంది.

విజయవాడలో అమాంతం అన్ని మార్పులు ఎలా వచ్చాయా?... అన్న సందేహం ఎవరికైనా రావొచ్చు! నా వద్ద అల్లావుద్దీన్ అద్భుతదీపం లాంటిది

ఏదైనా వుంది అనుకోవచ్చు. వీడెవడో కొత్త ఇంద్రజాలికుడిలా వున్నాడని ఏ కొందరైనా అనుకోవచ్చు! కానీ, అలాంటి మానవాతీతమైన శక్తులేవీ నా దగ్గరలేవు. నిజానికి ఆ మార్పు విజయవాడలో లేదు. సంతోష సాగరంలో మునిగి తేలుతున్న నా మనసులో వుంది. ఆ మార్పు కంతటికీ కారణం – ఆ రోజున ఎంతో వైభవంగా అక్కడ నాకు జరిగిన సన్మానమే!

అణువణువునా నాలో ఆనందం చోటు చేసుకుందేమో అంతగా ఆకలి అనిపించ లేదు. అందుచేత లైట్‌గా టిఫిన్ చేసి, నేను బసచేసిన లాడ్జి చేరుకున్నాను. మరునాడు వుదయమే గది ఖాళీచేస్తు న్నట్టు మేనేజరుకి చెప్పి, బిల్లు కూడా చెల్లించేశాను.

ప్రొద్దుట అయిదు గంటల కల్లా బండి వుంది. డ్యూటీలో చేరడానికి ఎల్లుండి వరకు గడువుంది. మూడు రోజుల ప్రయాణమని అంతగా సామా నేమీ తెచ్చుకోలేదు రెండు జతల టెర్రీ కాట్ బట్టలు, టవలు, సబ్బు వగైరా చిల్లర సామాను తప్ప మరేమీ లేవు. వచ్చేటప్పుడు వార్తలో కొన్న తెలుగు వీక్లీ, సగంవరకు చదివి మడిచిన 'మామ్' నవల బయట వుంచేసి, తక్కిన సామానంతా బ్రీఫ్‌కేసులో సర్దేశాను.

పాత న్యూస్‌పేపరులో భద్రంగా మడిచి తెచ్చిన శాలువ పైకితీసే సరికి నాకళ్లు మరోసారి ఆనందంతో మెరి శాయి. మనసంతా గర్వం నిండుకుంది. మేలిమి బంగారు రంగులో వున్న ఆ శాలువ నాకున్న విలువైన వస్తువుల్లో కెల్లా విలువైనదిగా తోచింది. ఆ శాలువ ఖరీదు వెయ్యి రూపాయల వరకు వుంటుందని కాదు. బంగారు జరీ వేయించి జపాన్ వంటి విదేశాల నుండి దిగుమతి చేయించింది కూడా కాదు. ఆ శాలువ ఖరీదు మహా అయితే ముప్పయి రూపా యలు వుంటుందేమో! కానీ, దానివలన నేను పొందిన ఆనందం మాత్రం ఇంత అని తేల్చి చెప్పలేనిది. ఆ ఆనందానికి ఖరీదు అనేది ఏదైనా వుంటే అది ఎంత యినా చేస్తుంది.

నవ్యసాహితీ వారు ప్రతియేటా తెలుగులో వెలువడే వివిధ సాహిత్య ప్రక్రియలను పరిశీలించి ఉత్తమంగా తోచిన కొన్నిటికి బహుమతి ప్రదానం చెయ్యడం కద్దు. నూటపదహారు రూపా యల నగదు బహుమానంతో పాటు ఆయా రచయితలను సన్మానించడం కూడ నవ్యసాహితీ వారికి పరిపాటే! ఆ యేడు నా కలం నుండి వెలువడిన 'నీటి బుడగలు' అను కథానిక అందుకు అర్హమైనదిగా నోచుకోవడం నిజంగా నా అదృష్టం! ఆ కారణంగానే ఈ సారి నేను విజయవాడ రావడం జరిగింది.

నవ్యహితీ వారు శాలువ కప్పి, నన్ను సన్మానించిన క్షణాలు జీవితంలో మరువ

లేనివి. రచయితగా నాకు జరిగిన మొదటి సన్మానం కూడ అదే! నాలో జీవిస్తున్న రచయిత మనసు ఆ క్షణాన ఆనందంతో ఎంతలా వుప్పొంగి పోయిందో చెప్పలేను. అప్పటి నా ఆనందానికి అవధులు లేకపోయాయి. ఆ మధురక్షణాలు జ్ఞాపకాల భోషాణంలో జీవితాంతం భద్రపరుచుకోవలసినవి.


ప్రఖ్యాత రచయితలు, రచయిత్రులు, పురప్రముఖులు, పెద్దలు, మరెందరో ఆ సభకు హాజరయ్యారు. 'మధుమూర్తిగారి రచన సాహితీ జగత్తుకి ఒక మణిపూస. రచన అనే పదానికి అతని కథ ఒక మంచి నిర్వచనం వాస్తవానికి అది గీటురాయి. మధుమూర్తిగారి కథానిక చదివాక మనిషి అంతరంగాన్ని చదవడంలో అతను ఎంతో నేర్పరి అని తెలుస్తుంది. ఇలాంటి ఉత్తమ రచయితలు మన తెలుగుగడ్డమీద పుట్టడం తెలుగువారు చేసుకున్న అదృష్టం!...' అలా ఎన్నో విధాల ప్రశంసించారు. ఆనందంతో వుక్కిరిబిక్కిరి చేశారు. ఆ ప్రశంశావాక్యాలు ఇంకా చెవుల్లో పదేపదే మార్మోగుతున్నాయి. ఆ మధుర క్షణాలు ఇంకా కళ్లముందుమెదులుతూనే వున్నాయి.

చేతిలో వున్న శాలువ మడిచి బ్రీఫ్ కేసులో భద్రంగా పెట్టాను. ఆ రాత్రి ఎంతోసేపటికి గాని, నాకు నిద్ర పట్టలేదు. మనసులో అనేకమైన ఆలోచనలు చోటుచేసుకున్నాయి.

ముందు ముందు కూడ అంటువంటి వుత్తమ రచనలే చేయాలని...కొత్తకొత్త ప్రయోగాలు చేసి రచనా విధానంలో ఒక విశిష్టత తీసుకురావాలని...సాంఘిక వ్యవస్థను మెరుగుపరిచే ఇతివృత్తాలనే ఎన్నుకోవాలని...పాఠకుల హృదయాలలో పదికాలాల పాటు వుత్తమ రచయితగా నిలిచిపోవాలని... మనసులో అలాంటి ఆలోచనలు గజిబిజిగా అనేకం అల్లుకున్నాయి.

అలా ఆలోచిస్తూ వుండగా ఎప్పుడు నిద్ర పట్టిందో నాకు గుర్తులేదు. తెల్లారి నాలుగు దాటుతుందనగా పనికుర్రాడి కేకతో అమాంతం మెలకువ వచ్చింది. నిద్రలేమి వలన కళ్లు మండుతున్నా లేవడం తప్పనిసరి అయింది ఆలస్యం చేస్తే రైలు తప్పిపోతుందనే భయంతో తొందరగా టాయిలెట్ అయి బయట పడ్డాను. ఈ లోపల పని కుర్రావాడు రిక్షా బేరమాడి సిద్ధంగా వుంచాడు. వాడికి ఇవ్వాల్సిన మామూలు ఇచ్చేసి, రిక్షా ఎక్కి కూర్చున్నాను.

చీకటి నలుగిశలా అప్పుడే విచ్చుకుంటుంది. ప్రకృతి అంతా తెల్లని ముసుగులో దాగున్నట్టు సన్నగా మంచు కురుస్తుంది. రిక్షా ముందుకి సాగిపోతుంటే చలిగాలి రివ్వున ముఖంమీద కొడు




తోంది. చలి ప్రభావానికి తట్టుకోలేక శరీరంలో సన్నగా వణుకు మొదలయింది.

బ్రీఫ్‌కేసులో వున్న శాలువ తీసి కప్పుకుంటే చలిబాధ కొంతయినా తగ్గుతుంది. కానీ, నా మనసు అందుకు సాహిసించలేకపోయింది. ఆ శాలువకున్న విలువను మరిచి ఇలా ఈ హింసించినందుకు నన్ను నేను మందలించుకొన్నాను. నా తొందరపాటుకి చెంపలేసుకున్నా పర్వాలేదనిపించింది.

రైలు రావడానికి మరో పావుగంట వుందనగా రిక్షా స్టేషన్ చేరుకుంది. టిక్కెట్టు తీసుకుందామని క్యూలో వెళ్లి నిల్చున్నాను. పక్కవాళ్ల సంభాషణ బట్టి రైలు రావడం రెండు గంటల ఆలస్యం అని తెలిసింది. అది ఎంత వరకు నిజమో అని ఆలోచిస్తూ వుండగా అనౌన్సరు ఆ విషయం మైకులో నిర్ధారణ పరిచాడు.

'ఛ; పాడురైళ్లు. ముసలిదాని నడక కన్నా అధ్వాన్నంగా తయారవుతున్నాయి. ఏ రైల్వేఅధికారి అయినా తన భార్యను పురిటికి ఈ రైళ్లలో పుట్టింటికి పంపితే బావుణ్ణు; ఆనక ఆవిడ రైల్లోనే పురుడు పోసుకుని, ఆ బిడ్డకు పేరు కూడ పెట్టాక గాని పుట్టింటికి చేరదేమో: ఒకవేళ అలా జరిగినా ఈ రైళ్లు టైముమీద నడుస్తాయనే గ్యారంటీ వుండదు నాలాంటి ప్రయాణీకులకు ఈ పాట్లూ తప్పవు;'

నా కళ్లు మండుతున్నంతలా మనసు భగభగా మండింది. అనవసరంగా కంగారుపడి ఆదరాబాదరాగా పరుగెత్తుకొచ్చాను. లేకుంటే మరో రెండుగంటలు హాయిగా కాళ్లు ముడుచుకుని పడుకునే వాడిని. ఎన్ని అనుకున్నా ఇప్పుడు వెనక్కి తిరిగి వెళ్లలేను. ఆ రెండు గంటలు ప్లాట్‌ఫారమే శరణ్యం అనుకుని ఏదో విధంగా గడిపెయ్యాలి. ఖాళీగా వున్న ఒక సిమెంటు బెంచిమీద బ్రీఫ్‌కేసు పక్కన పెట్టుకుని కూర్చున్నాను.

మరో రెండుగంటల తర్వాత మాట కదా అన్నంత ధీమాగా నిద్రపోతున్నట్టుంది స్టేషన్. ప్రయాణీకులు అక్కడ

క్కడా కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. ఏ గూడ్సుబండో వుండుండి పెద్దగా శబ్దంచేస్తూ ప్రయాణికులకు నిద్రాభంగం కలిగిస్తుంది. తోపుడు బళ్ల వాళ్లు నిలబడలేక నీరసంగా జోగుతున్నారు. ఎప్పుడో వచ్చే రైలుకోసం కూలీలు నిద్రకాస్తూ ఎదురు చూస్తున్నారు. ఊరకుక్క ఒకటి ఆ చలిలో పయాణికుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంది.

సాలోచనగా స్టేషన్ అంతా కలియజూస్తున్న నేను, నా ముందు నీడలా కదిలిన ఆకారం వైపు అమాంతం దృష్టి మరల్చాను. నా ముందునుండి నడిచి వెళ్తున్న అతణ్ణి చూశాక నాలో ఏదో అనుమానం మొలకెత్తింది. స్టేషన్‌లో నేను అడుగుపెట్టిన దగ్గర నుండీ అతను నీడలా నన్ను వెన్నంటుతూనే వున్నాడు. బ్రీఫ్‌కేసు క్రిందపెట్టి రిక్షావాడికి డబ్బులిస్తున్నప్పుడు...టిక్కెట్టు కొనడానికి పర్సు తీసి డబ్బు లెక్కపెడుతున్నప్పుడు...అతని చూపులన్నీ నా మీదే వున్నాయి. ఇప్పుడు మళ్లీ ప్లాట్‌ఫారం మీద ప్రత్యక్షమయ్యాడు. అతను ప్రత్యేకంగా నా వెన్నంటే ఎందుకు తిరుగుతున్నాడో నాకు అర్థంకాలేదు. అదమరిస్తే బ్రీఫ్‌కేసు పట్టుకుని వుడాయిద్దామనే ప్లాన్ కాదుగదా! అతని ప్రవర్తన చూస్తుంటే నాకలాగే అనిపించింది.

ఏదో పనివున్నవాడిలా అక్కడి కక్కడే పచార్లు సాగించాడు. ఈసారి అతని కేసి పరిశీలనగా చూశాను. అతనికి నిండా ఇరవై యేళ్లు వుండవేమో! అతని శరీరం బలహీనంగా వుంది. లోతుకుపోయివున్న కళ్లలో ఇంకా చురుకుతనం మిగిలివుంది. పసిమిఛాయలో వున్న అతని శరీరం నిండా నల్లగా మట్టిపేరుకుని వుంది. అతని జుత్తు ధూళితో మిళితమై సంస్కారహీనంగా వుంది. అతని ఒంటిమీద బట్టలు ఏ రంగులో పోల్చుకోలేనంతగా మాసివున్నాయి. అతని చూపుల్లో ఎలాంటి భావమూ లేదు. అతని చేతలు మాత్రం వింతగా వున్నాయి. ఎంతగా ఆలోచించినా అతన్ని గురించి ఒకస్థిరమైన అభిప్రాయానికి రాలేకపోయాను. ఏదో దురుద్దేశంతో వున్నాడని మాత్రం నా మనసు హెచ్చరించింది.

కడుపులో ఆకలి పేగుల్ని జివ్వుమని కదిలిస్తుంది. నిన్నంతా ఆనందంతో కడుపు నింపేసుకున్నాను. నిజమైన ఆకలేమిటో ఇప్పుడు తెలుస్తుంది. ఎక్కడ రైలు తప్పిపోతుందో అనే ఆత్రతలో కాఫీ కూడ తీసుకోలేదు. నేను కూర్చున్న చోటుకి కొంచెం దూరంలో రైల్వే కేంటీను వుంది. బ్రీఫ్‌కేసు చేతిలోకి తీసుకుని కేంటీను కేసి దారితీశాను. అతను దూర దూరంగా నడుస్తూ నన్ను అనుసరిస్తున్నాడు. బ్రీఫ్‌కేసు పట్టుకున్న నా చెయ్యి ఎందుకో గట్టిగా బిగుసుకుంది. కేంటి

నులో కూర్చుని టిఫిన్ తింటున్న నన్ను కళ్లప్పగించి చూస్తూ బయట నిలుచున్నాడు. కాఫీ కూడ తీసుకుని కాసేపటికి బయటపడ్డాను. మళ్లీ ఆ సిమెంటు బెంచి దగ్గరకే వెళ్లి కూర్చున్నాను. బ్రీఫ్‌కేసు పక్కన పెట్టబోయి మానేసి, ఒళ్లో పెట్టుకున్నాను. అతన్నిగురించిఆలోచించడం మాని, సగం చదివి మడిచిన 'మామ్' నవల తెరిచాను.

కొంత సేపటిక ఎవరో వచ్చి నా పక్కన కూర్చున్నట్టయింది. నా తల యాంత్రికంగా పక్కకు తిరిగింది. అతనెవరో కాని, నాలాగే రైలు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికుడై వుండాలి. అతని చేతిలో కాలుతున్న సిగరెట్టు వుంది. అతనిలో కావలసినంత కంగారు కనిపిస్తుంది. వెనుకబడిన రైలుకోసం మాటిమాటికి ముందుకి కదులుతున్న వాచికేసి చూస్తున్నాడు. అసహనంగా అటూ ఇటూ కదులుతున్నాడు. చేతిలో వున్న సిగరెట్టు కాసేపటికి కింద పారేస్తున్నాడు. అది అతని అలవాటో, రైలు రాలేదనే చిరాకో నాకు అర్థంకాలేదు. మరో గంట గడిస్తేనే గాని, రైలు రాదు. అతని అర్థంలేని ఆరాటానికి నాకు నవ్వొచ్చింది.

"వెధవరైళ్లు... డర్టీసర్వీస్ ?"... తెలుగు, ఇంగ్లీషు పదాలను మిశ్రమం చేసి మరీ శపించాడు రైల్వేవాళ్లందర్నీ. 'ఎంత అవసరమైన పనిమీద వెళ్తున్నాడో పాపం !' అనిపించింది.

మరో సిగరెట్టు తీసి వెలిగించబోయి మానేసి, చివాల్న పైకి లేచాడు. నాలుగైదుసార్లు ఆ చివరినుండి ఈ చివరి వరకు పచార్లు చేశాడు. అతని ప్రవర్తన నాలో కుతూహలాన్ని రేపింది. పుస్తకంలో తల దూర్చానన్న మాటేగాని, నా చూపులు మాత్రం అతని చుట్టూ తిరుగుతున్నాయి.

అతని వయసు ముప్ఫై దాటి వుంటుంది. అతని ముఖం చూస్తుంటే ఆ వయసుకి తగిన జ్ఞానం పెరగలేనట్టు వుంది. అతను ధరించిన కోవారంగు సిల్కుకమీజు, పల్చటి పైజామా ఎంతో శుభ్రంగా వున్నాయి. అతని చేతిలో వున్న న్యూస్‌పేపరు ఎప్పటిదో గాని, అతను బాగా చదుకున్నవాడు అని చెబుతుంది. అతను సగం వరకు కాల్చి పారేసిన సిగరెట్టు పీకలు అతను స్థితిమంతుడని చాటుతున్నాయి. అతను ఎంతో అర్జంటుపనిమీద వెళ్తున్నాడని అతని ఆరాటం చెప్పక చెబుతుంద.

కాళ్లకి అలసటే కలిగిందో, కూర్చోవాలనే కోరికే కలిగిందో మళ్లీ వచ్చి నా పక్కనే కూర్చున్నాడు. నాకేసితిరిగి, "ఎక్స్‌క్యూస్మీ ! ఆ పేపర్ని ఒకసారి ఇస్తారా ?" అని అడిగాడు.

అడిగిన పేపర్ని అతనికి ఇచ్చాను. సినిమా బొమ్మలున్న పేజీలు మాత్రం

కాసేపు అటూ ఇటూ తిరగవేశాడు. కథలంటే బొత్తిగా టేస్టు లేనట్టుంది మనిషికి ! అనుకున్నాను.

పావుగంట తర్వాత పత్రిక తిరిగి ఇచ్చేసి, జేబులో వున్న సిగరెట్టుపెట్టె పైకి తీశాడు. మూత తీసిన సిగరెట్టు పెట్టెను నా ముందుకు చాపి, "సిగరెట్ ప్లీజ్ !" అన్నాడు సంశయిస్తూనే.


"నో థాంక్స్ ! అలవాటు లేదు" అన్నాను.

తెరిచిన పెట్టెనుండి ఒక సిగరెట్టు తీసితను వెలిగించాడు. సాలోచనగా రెండు దమ్ములు లాగి, "ఆ కుర్రాడు మిమ్మల్ని చాలా సేపటినుండి ఫాలో' అవుతున్నాడు గమనించారా ?" అన్నాడు, ఇంకా మాకళ్లముందే పచార్లు చేస్తున్న కుర్రవాడిని వుద్దేశిస్తూ.

"గమనించాను కానీ, అతను ప్రత్యేకంగా నా వెంబడే ఎందుకు తిరుగుతున్నాడో అర్థంకాకుండా వుంది" నన్ను పీడిస్తున్న సందేహాన్ని బయటపెట్టాను.

"భలేవారే ! ఇంకా అర్థం కాకపోవడానికి ఏముందండీ ? అచ్చుగుద్దినట్టు వాడి ముఖమే చెబుతుంటేను ! ఈ మధ్య ప్రతి స్టేషనులో ఇలాంటి దొంగవెధవలు ఎక్కువయిపోయారు. కాస్త ఆదమరిస్తే చాలు, కళ్లలో కారం కొట్టేస్తున్నారు. మొన్న ఈ మధ్యనే నేను కలకత్తా వెళ్లాను. వ్యాపార నిమిత్తమే అనుకోండి! హౌరా స్టేషన్‌లో అడుగు పెడుతూనే అనుకున్నాను, స్టేషన్ దాటేవరకు కొంత జాగ్రత్తగా వుండాలని. కానీ, ఎంతలా నేను భయపడ్డానో అంతా జరిగింది. ఆ రోజు. 'కూలీ బాబూ ! కూలీ' అని అరుస్తూ వద్దంటున్నా నా చేతిలోని సూట్‌కేసు లాక్కున్నాడు ఒక కుర్రవెధవ ! వీడికన్నా రెండేళ్లు తక్కువ వుంటాయేమో వాడికి ! కుర్రవెధవ కదా పోనీలే పావలా డబ్బులిద్దాం అని నేను వూరుకున్నాను. నా కళ్లముందు నడుస్తున్నవాడు కళ్లలో కారం కొట్టినట్టు గభాల్న ఎటో మాయమయ్యాడు. ఇంక ఆ జనంలో వాడిని ఎక్కడని వెదకను? అప్పటికి పిచ్చివాడిలా కాసేపు అటూ ఇటూ పరుగులెత్తాను. కనిపిస్తేగా కుర్రవెధవ ! స్టేషన్‌మాష్టారుకి రిపోర్టు యిస్తే ఏమైనా ఫలితం వుంటుందేమోనని వెళ్లి కలిశాను. అతగాడు నన్ను పిచ్చివాడిని చూసినట్టు చూసి, 'అచ్ఛా ! ఠికానా లగా యేంగే !' అన్నాడు. ఇంకేం ఠికానా ? సూట్ కేసు, అందులో పెట్టిన ఆరువందలు గోవిందా ! అదృష్టం కొద్దీ జేబులో కొంత డబ్బు వుండబట్టి సరిపోయింది. లేకుంటే అక్కడ నా పాట్లు ఏ దేవుడితో చెప్పుకోను ? అమ్మో ! చూడటానికి మెత్తగా కనిపిస్తారు కానీ, ఈ దొంగ వెధవల్ని నమ్మలేం. ఎందుకైనా మంచిది కొంచెం జాగ్రత్తగా వుండండి!" అన్నాడు మరో సిగరెట్టుతీసి వెలిగిస్తూ.

నిజమే ! ఇలాంటి వాళ్లు ఎంతకైనా




తెగిస్తారు. అంతదాకా నన్ను పీడుస్తున్న అనుమానాన్ని అతను బలపరిచాడు. అవ్యక్తమైన భయమేమో నాలో చోటు చేసుకుంది. నవ్యసాహితీ వారు బహుమతిగా ఇచ్చిన నూటపదహారు రూపాయలు జేబులోనే వున్నాయి. అదీ ఒకందుకు మంచిదే అనిపించింది.

మేము కూర్చున్నచోటుకి అయిదారు గజాల దూరంలో ఆ కుర్రవాడు నిలుచుని వున్నాడు. అక్కడున్న స్తంభానికి చేరబడి కళ్లు నాలుగువైపులా కదిలిస్తున్నాడు. అతని చూపులు ఎక్కువగా నన్నే పరిశీలిస్తున్నాయి. అంతవరకు అతనిమీద నేను పడుతున్న జాలి కాస్తా కరిగిపోయింది ఈసారి అతనివైపు చూసేసరికి ఎంతైనా అసహ్యం కలిగింది. దొంగతనం చేసి ఈ నీచపు బ్రతుకు బ్రతికే కన్నా అడుక్కు తినరాదూ, వెధవ! ఈ చిన్న వయసులో వీళ్లకి ఈ పాడుబుద్ధులెందుకో?...ఆలోచనలు కాసేపు గజిబిజిగా పరుగెత్తాయి.

"అన్నట్టు, మీరు ఎంతదాకా వెళ్తున్నారు?" పక్కతను అడిగిన ప్రశ్నతో వెంటనే తేరుకుని, "వాల్తేరు" అన్నాను ముక్తసరిగా.

"ఓహ్! ఇంకేం! రైలు దిగేవరకు నాకు మంచి కాలక్షేపమన్నమాట! వాల్తేరులో మీరు ఏం చేస్తుంటారు? చదువుకుంటున్నారా?"

"లేదండీ! బ్యాంక్‌లో వుద్యోగం చేస్తున్నాను."

"ఆఫీసు పనిమీద వచ్చారా ఈ వూరు?"

"అవునండీ!" అనేశాను, అతని ప్రశ్నల వర్షం అంతటితో ఆపుచేద్దామని.

నేను రచయితననీ, ఆ వూరిలో నాకు సన్మానం జరిగిందని, ఆ పని మీదే ఇక్కడికి వచ్చినట్టు చెప్పాలనిపించక అలా తప్పించుకున్నాను. ఒకవేళ అవన్నీ చెప్పినా అతను ఆసక్తిగా వింటాడనే నమ్మకం నాకు లేదు. తను వీక్లీ

అడిగి తీసుకుని సినిమా బొమ్మలు చూస్తున్నప్పుడే అనుకున్నాను - రచనలంటే అతనికి ఏ మాత్రము టేస్టు లేదని. అలాంటి మనిషితో వాటి గురించి చర్చించడం వలన ఎలాంటి ప్రయోజనం వుండదు. అందుకే ఆఫీసు పనిమీద వచ్చానని చెప్పి వూరుకున్నాను.

నాతో మాటల్లోకి దిగాక అతని ఆరాటమంతా ఏమయిందో నాకు అర్థం కాలేదు. ఆ కాసేపు నవ్వుతూ నాతో సరదాగా కబుర్లు చెప్పాడు. బహుశా! ఇందాక "లోన్లినెస్" ఫీలయ్యాడేమో!

అనౌన్సు చేసిన రెండుగంటల ఆలస్యానికి మరో అరగంట జోడించి స్టేషన్ చేరింది రైలు. నేను, ఆ సిల్కులాల్చీ అతను ఒకే కంపార్టుమెంటులో ఎక్కాం. ఆ కంపార్టుమెంటు కొంత ఖాళీగా వుండటంచేత మా ఇద్దరికీ పక్కపక్కనే సీటు దొరికింది. బ్రీఫ్‌కేసు కాళ్లదగ్గర పడేసుకుని వెనక్కి జారబడి కూర్చున్నాను. సిల్కులాల్చీ అతను ఎంతదాకా ప్రయాణం చేస్తున్నాడో నేను అడగనే లేదు. అది అంత అవసరం కాకపోయినా మర్యాద కొద్దీ అడిగాను.

"నేను తునిదాకా వస్తాను లెండి. గుంటూరులో మాకు పొగాకు వ్యాపారం వుంది. నిన్న మధ్యాహ్నం అనగా విజయవాడ వచ్చాను. ఈ డీలర్సు సరుకు తీసుకుంటారు కానీ, సొమ్ము సరిగ్గా కట్టరు. పనికట్టుకుని వీళ్ల చుట్టూ పదిసార్లయినా తిరగాలి. నిన్నంతా తిరిగి ఎలాగో నాలుగువేల వరకు వసూలు చేశాను ఇక్కడ పని పూర్తి అయినట్టే. ఇవాళంతా తునిలో పనిచూసుకుని రేపటికి ఇల్లు చేరాలి. నేను దగ్గరలేకపోతే మా నాన్నగారికి కాలు, చెయ్యీ ఆడదు" నేను అడిగిన దానికి సమాధానంగా అతను అంత ఉపోద్ఘాతం వెల్లబోశాడు

నేను అనుకున్నంత అమాయకుడు మాత్రం కాదు అతను! ఒక మాదిరి బిజినెస్ మేగ్నెట్ అన్నమాట. అతని మాటల్లో వున్న చురుకుదనమే అది రుజువుచేస్తుంది. అతను చెప్పిన మాటల్ని బట్టి వ్యాపార విషయాల్లో అతనికి మంచి నేర్పు వుందనిపిస్తుంది

కాసేపటికి రైలు బరువుగా ముందుకు కదిలింది. కదులుతున్న రైలుతో బాటు నాకు సన్నగా తలనొప్పి ప్రారంభమయింది. బాధతో కళ్లుబరువుగామూతలు పడుతున్నాయి. క్రితంరాత్రి ఆలోచనలతో బుర్రంతా వేడెక్కిపోయింది. ఆ వేడిసెగలు కాస్త ఇప్పుడు బయటికి వస్తున్నాయి. కాసేపు రెస్టు తీసుకుందామని వెనక్కి తలవాల్చి కళ్లు మూసుకున్నాను.

"వెధవ! ఆఖరికి రైల్లో కూడా దాపురించాడండీ! చూస్తుంటే ఏదో పెద్దఎత్తే వేసినట్టున్నాడు."

పక్కతని మాటలు విని అమాంతం కళ్ళు తెరిచాను నా చూపులు తలుపుకి

జేరబడి కూర్చున్న వ్యక్తి వైపు యాంత్రికంగా మళ్ళాయి. అంతవరకు స్టేషన్‌లో నన్ను అనుసరించిన కుర్రవాడు సరాసరి ఇప్పుడు రైలుపెట్టెలోకే వచ్చిచేరాడు.

"వీడెవడో గాని, నా అంతుచూసేలా వున్నాడు లాభంలేదు. రైలు దిగేంత వరకు నా జాగ్రత్తలో నేను వుండాల్సిందే!" అనుకున్నాను మనసులో.

తలనొప్పి మాట ఎలావున్నా పక్కతనితో కబుర్లాడటం తప్పలేదు. అతను తనవ్యాపార విషయాలేవో చెప్పి ఒకటే బోరు కొట్టించేస్తున్నాడు. ఉన్న తలనొప్పి నాలుగింతలయింది. మాట్లాడే ఓపికలేక అతను చెబుతున్న వాటికి 'ఊఁ!' కొడుతూ కూర్చున్నాను.

ఆ కొద్దిపాటి పరిచయానికే అతను నన్ను ఆప్తమిత్రునిలా ఎంచి ఎన్నో విషయాలు చెప్పాడు. తనకున్న ఆస్తిపాస్తుల గురించి, పొలాల గురించి, పంటల గురించి చాలా చెప్పాడు. కొన్ని నా బుర్రకెక్కలేదు.

మరి కాసేపటికి అతను రాజకీయాల్లోకి దిగిపోయాడు ఈ వ్యాపారం అదీ మానేసి అమాంతం తనకి ఎమ్మెల్యే అయిపోదామని వుందట! అందులో అయితే పెద్ద పెట్టుబడి లేకుండ లాభాలు గడించవచ్చునట. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితి గురించి, ఇందిరాగాంధి తెలివితేటల గురించి తనకు తెలిసీ తెలియని విషయాలేవో చర్చించాడు. మన ఆంధ్రదేశం ఇందిరమ్మ లాటి కూతురు పరిపాలిస్తే బాగుపడిపోతుందట. అలాంటి విషయాలు విన్నప్పుడు మాత్రం నాకు నవ్వాగలేదు.

రైలు తాడేపల్లిగూడెంలో ఆగడంతో, "ఈ సంచి కాస్త మీ దగ్గర వుంచండి సిగరెట్లు అయిపోయాయి. వెళ్ళి తెచ్చుకుంటాను. అన్నట్టు, మీకేమైనా తీసుకు రమ్మంటారా?" అని అడిగాడు పైకిలేస్తూ.

నాకేమీ అక్కర్లేదని చెప్పాక తను ప్లాట్‌పారంమీదికి వెళ్లిపోయాడు. నాకు అప్పగించిన సంచిలో బహుశా అతను విజయవాడలో వసూలు చేసిన నాలుగు వేలు వుండివుంటాయి. ఆ కాస్త పరిచయానికే నన్ను అంతలా నమ్మిన అతని వ్యక్తిత్వాన్ని మనసులో అభినందించకుండ వుండలేకపోయాను.

సిల్కులాల్చీ అతను సిగరెట్లు కొనుక్కొని కాసేపటికి తిరిగొచ్చాడు. తెచ్చిన సిగరెట్లలో ఒకటి తీసి వెలిగించి, మళ్ళీ సంభాషణ మొదలు పెట్టాడు

అతని సంభాషణంతా ఈ సారి సినిమాల మీదికి దొర్లింది. విడుదలయిన ప్రతి తెలుగు సినిమా అతను విధిగా చూస్తాడట. తన అభిమాన నటుడువున్న సినిమా అయితే నాలుగయిదు సార్లయినా చూడకపోతే అతనికి తృప్తి ఉండదట. తనకున్న ఆస్తిలో పాతికవేలు పట్టుకుని మద్రాసు వెళ్లి మంచి స్టంటు సినిమా తీయాలని వుందట. జ్యోతిలక్ష్మిని పెట్టి


కుంటే లాభాలు రాకపోయినా నష్టం మాత్రం వుండదట కానీ వాళ్లనాన్నగారు మాత్రం ఎంత చెప్పినా అందుకు ఒప్పుకోవడం లేదట.

అతని అమాయకత్వానికి నవ్వొచ్చినా ఆపుకున్నాను. పాతికవేలు పెడితే సినిమా వస్తుందని ఏ అమాయకుడు చెప్పాడో పాపం ఈ అమాయకుడికి! ఇలాంటి వాళ్ళు సినిమాలు తియ్యడం కూడానా?

ఒకవైపు అతని మాటల్లో కొడుతున్న బోరు, మరోవైపు నా తలనొప్పి పెడుతున్న బాధ రెండూ భరిస్తూ కూర్చున్నాను. అంతకంతకు నా తలనొప్పి అధికమయిందే గాని తగ్గలేదు. రాజమండ్రిలో రైలు ఆగేసరికి ఆ బాధ భరించరానంత అయింది. స్టేషన్‌లో ఏదైనా తలనొప్పి తగ్గే మాత్ర కొనుక్కొని మింగితేనేగాని లాభం లేదనిపించింది. గొంతులో కాస్తంత వేడికాఫీ అయినా దిగితేనేగాని రిలీఫ్ కలిగేలా లేదు. సిల్కులాల్చీ అతను సాలోచనగా సిగరెట్ కాలుస్తున్నాడు. నా బ్రీఫ్‌కేసు అతనికి అప్పగించి ప్లాట్‌పారం మీదికి వురికాను. శీతాకాలపు ఎండ శరీరానికి నునువెచ్చగా తగులుతుంది. బయట వాతావరణం కొంత హాయనిపించింది. తలనొప్పి తగ్గడానికి మాత్రలేవైనా దొరుకుతాయేమోనని ప్లాట్‌ఫారం అంతా గాలించాను. కొట్లు అన్నీ పక్క ప్లాట్‌ఫారం మీద వున్నాయి. రైలు కదలడానికి మరో పది నిముషాలు వ్యవధి వుంది. అందుచేత ఓవర్‌బ్రిడ్జి క్రాస్‌చేసి అవతలవైపుకి వెళ్ళాను. ఒక కొట్టులో అనాసిన్ మాత్రలు కొనుక్కొని కాఫీతో మింగాను. గొంతులో వేడికాఫీ పడటంతో కొంత రిలీఫ్ కనిపించింది. నేను తిరిగి కంపార్టుమెంటు చేరుకునే సరికి రైలు బరువుగా ముందుకు కదిలింది.

నా సీటుదగ్గరికి వెళ్ళి చూసేసరికి నా గుండెలు ఒక్కసారిగా ఝల్లుమన్నాయి. మేము కూర్చున్న సీట్లలో మరెవరో కూర్చుని వున్నారు. తన మాటలతో నన్ను దగ్గరచేసుకున్న సిల్కులాల్చీ అతను దగ్గర్లో ఎక్కడా లేడు. ఇందాక లేని కొత్తమనుషులెవరో ఇప్పుడు వున్నారు. వాళ్లంతా ఎవరి గొడవల్లో వాళ్లున్నారు. ఎవరికి తోచిన విషయాలువాళ్ళు మాట్లాడుకుంటున్నారు. సిల్కులాల్చీ అతనికోసం నేను పెట్టంతా పిచ్చివాడిలా గాలిస్తున్నాను. కనబడని బ్రీఫ్‌కేస్ కోసం ఒళ్ళంతా కళ్లుచేసుకుని వెదుకుతున్నాను.

తొందరలో కంపార్టుమెంటు గాని మారలేదు కదా! సందేహం పట్టలేక పెట్టంతా ఒకసారి కలియజూశాను. ఒకటి, రెండు......తప్ప అన్నీ పాత ముఖాలే! నా ఎదురుగా కూర్చున్న బట్టతల పెద్దమనిషి, ఆ పక్కనే ఆయాసంతో




దగ్గుతున్న ముసలాయన, అతనికి ఏమౌతుందో తెలీదుగాని, అతని పక్కనే కూర్చున్న పల్లెటూరి పడుచు, ఆ చివర నున్న ఒరియా బ్రాహ్మడు అంతా ఎక్కడి వాళ్ళక్కడే వున్నారు. నా బ్రీఫ్‌కేస్ అప్పగించిన సిల్కుచొక్కా అతను మాత్రం లేడు. అతను కాల్చిపారేసిన సిగరెట్టు పీకలు నన్ను చూసి హేళనగా నవ్వుతున్నట్టున్నాయి.

అజ్ఞాతంగా నన్నేమో అనుమానం పీక్కుతింటుంది. సిల్కుచొక్కా అతను లేడు, అతనికి అప్పగించిన నా బ్రీఫ్ కేసూలేదు. అంటే?...

అర్థమయ్యేసరికి నా తల ఒకసారి గిర్రున తిరిగింది. నేను ప్రయాణం చేస్తున్న రైలు నామీదే పరుగెడుతుందా అన్నంత కంపరం లేచింది మనసులో! ఏమి చెయ్యడానికి తోచని అయోమయావస్థలో కాసేపు పడిపోయాను.

"ఏమయిందండీ? ఏమిటిపోయింది?"

నా ముఖంలోని ఆందోళనని, నా చేతల్లోని ఆరాటాన్ని పసిగట్టి ఎన్నో గొంతులు ఒక్కసారి ప్రశ్నించాయి. నా చెవిలో చేరని మరెన్నో ప్రశ్నలు గాలిలో కలిసిపోయాయి. అడిగిన వాళ్ళందరికీ జవాబు చెప్పేస్థితిలో నేను లేను.

నాలో ఏదోమూల ఇంకా అనుమానం పీకుతునే వుంది. దగ్గుతూ వున్న ముసలాడి దగ్గరగా వెళ్ళి, "ఇందాక ఇక్కడ కూర్చున్న సిల్కులాల్చీ అతను ఏమయ్యాడు?" తగ్గు స్వరంతో అడిగాను.

"ఆ బాబు రాజమండ్రిలో మీ ఎనకాలే దిగిపోనాడండీ!"

ముసలాడు చెప్పింది విన్నాక నోరు మూసుకోవడం తప్ప నేను చెయ్యగలిగింది ఏమీ కనిపించలేదు. అంతవరకు హాయిగా కూర్చున్న సీటుపోయింది. ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న బ్రీఫ్ కేసు పోయింది. ఉదయం నుండి నన్ను పీడిస్తున్న తలనొప్పి ఎటోపారిపోయింది.

ఒకమూల నిలుచుని మౌనంగా ఆలో చిస్తున్నాను.

అన్యమనస్కంగా వున్నందున కాళ్ల దగ్గర ఏమయిందో నేను వెంటనే చూసు కోలేదు. అటుగా నిలుచున్నవాడిని ఇటు తిరగడంతో కాళ్ళకుఏదో అడ్డుతగిలింది. నా చూపులు యాంత్రికంగా కిందకు మళ్లాయి. కళ్లెదుట వున్న ఆ దృశ్యాన్ని చూశాక నాగుండెల్ని ఎవరో గట్టిగా పట్టి నట్టయింది. నాలో అంతవరకు ఏ మూలనో నిద్రపోతున్న మానవత్వం ఒక్కసారి ఒళ్ళువిరుచుకుంది.

విజయవాడ స్టేషన్‌లో నన్ను వెంబ డించిన కుర్రవాడు కాళ్లూచేతులు ముడుచు కుని కిందపడుకుని వున్నాడు. అతని అపాదమస్తకం గజగజా వణుకుతుంది. బాధతో అతని శరీరం మెలికలుతిరుగు తుంది. ఏడ్చే ఓపిక లేనట్టు సన్నగా మూలుగుతున్నాడు అలా మూలుగుతూ మధ్యలో "అమ్మా!" అంటూ తల్లిని గుర్తు తెచ్చుకుంటున్నాడు.


అతణ్ణి ఆ స్థితిలోచూశాక ఏదోతప్పు చేశాననే భావంతో మనసంతా సిగ్గుతో ముడుచుకుపోయింది. అవ్యక్తమైనబాధ నన్ను నిలువునా దహించివేసింది. పశ్చా త్తాపంతో విలవిలా కొట్టుకుంది నా అంత రంగం.

కంపార్టుమెంటులో వున్నవాళ్లంతా ఎవరి ధ్యాసలో వాళ్ళున్నారు. ఎవరికి తోచిన విషయాలు వాళ్ళు మాట్లాడు కుంటున్నారు. ఎవరి గమ్యం గురించి వాళ్ళు ఆలోచించుకుంటున్నారు. కానీ, హృదయవిదారకంగా బాధపడుతున్న ఆ కుర్రవాని వునికిమాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం "అయ్యో పాపం!" అని జాలిపడే దాతలు కూడా లేకపోయారు. నన్నుమించిన అజ్ఞానుల్లా వున్నారు అంతా!

మరోఆలోచన చెయ్యకుండాముందుకి వంగాను. అదురుతున్న అతని తలమీద చెయ్యివేసి చూశాను. నిప్పు కణికలా వేడిగా వుంది అతని ఒళ్లు! షాక్ తిన్న వాడిలా వెంటనే చెయ్యి వెనక్కి తీసు కున్నాను. బరువుగా కళ్లు విప్పి అతను భయపడుతూ నా వంక చూశాడు. అతని కళ్లలో అమాంతం నీళ్లు చిప్పి ల్లాయి. ఏదో చెప్పాలనే ప్రయత్నంలో అతని పెదాలు సన్నగా వణికాయి.

"భయపడకు. ఏం కావాలో చెప్పు!" ఎంతో అనునయంగా అడిగాను.

అతను బరువుగా ఒక నిశ్వాస విడిచి "నేను ఎవరూలేని అనాధను బాబు! మొన్నటి వరకు మా అమ్మ వుండేది. మా నాన్న చనిపోయాక మా అమ్మే నన్ను కష్టపడి పెంచింది. చదివించి నన్ను ఎంతో గొప్పవాడిని చెయ్యాలను కుంది. కానీ ఆ ఆశలన్నీ తీరకముందే ఆమె కన్నుమూసింది. ఈ లోకంలో "నా" అనేవారు నాకెవరూ లేరు. చేద్దా మంటే పని దొరకడంలేదు. అడుక్కు




తిందామంటే చేతులురావటంలేదు. చచ్చిపోదామంటేధైర్యంచాలడంలేదు. మూడు రోజులుగా అన్నంముఖం చూడలేదు. నీళ్లు తాగి కడుపు నింపుకుంటున్నాను. ఇవాళ వుదయం కళ్లు విప్పుతోవుండగా రిక్షా దిగుతూ మీరు కనిపించారు. కడుపులో ఆకలి నన్ను కదిలించింది. నా ఆకలి మీరు తీరుస్తారనే ఆశ కలిగింది. మీ చేతిలోవున్న పెట్టె మోసి, మీరిచ్చే పావలాడబ్బుల్తో కాఫీనీళ్లయినా తాగదామనుకున్నాను ఆ ఆశతోనే వుదయం నుండీ మీ చుట్టూ తిరిగాను కానీ, నోరు విడిచి అడిగే ధైర్యం లేకపోయింది నాలాంటివాళ్ళు బ్రతికేకన్నా చచ్చిపోవడమే నయం బాబూ!" అన్నాడు పొంగుకొచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

అంతటి దీనావస్థలో బ్రతుకుతున్న అతనిలో అభిమానం ఇంకా బ్రతికేవుంది. హృదయంలో అట్టడుగున పడివున్న అభిమానం అతణ్ణి అడుక్కోనివ్వడం లేదు. తను చచ్చిపోవడానికైనా సిద్ధపడుతున్నాడు గాని తనలోని అభిమానాన్ని చంపుకోవడానికి మాత్రం అతను ఇష్టపడటంలేదు.

నా అంతరంగాన్ని ఏదో అజ్ఞాతశక్తి తట్టి లేపినట్టయింది. అమాంతం నాలో అనేకమైన ప్రశ్నలు తలఎత్తాయి.

లోకమంటే ఏమిటో తెలియని ఈ పసివాణ్ణా నేను అనుమానించింది? అన్నెం పున్నెం ఎరుగని ఈఅమాయకుణ్ణా నేను అసహ్యించుకుంది? ఆకలితో ప్రాణం పోతున్నా చెయ్యిచాపి అడుక్కోవడానికి ఇష్టపడని ఈ అభిమానధనుణ్ణా నేను దొంగగా వూహించుకుంది.

ఎన్నో కథలు రాశాను. ఆ కథల్లో రకరకాల పాత్రలు సృష్టించాను. ఆ పాత్రలచేత ఎన్నో నీతులు పలికించాను. నిజాలు చెప్పించాను. మనిషి అంత

రంగంలో రగిలే అనేక సమస్యలకు ఎక్స్‌రేలు తీశాను ఆ సమస్యలకు పరిష్కారమార్గాలు సూచించాను. జీవితానికి క్రొత్తక్రొత్త అర్థాలెన్నో చెప్పాను. రచయితగా పేరు ప్రఖ్యాతులు గడించాను. సన్మానం చేయించుకున్నాను. కానీ, ఈ రోజు కళ్ళ కెదురుగా నిలిచిన మంచి-చెడులలో భేదాన్ని మాత్రం తెలుసుకోలేకపోయాను. నా తెలివిఅంతా ఏ మూల దాగుంది? నేను గడించిన విజ్ఞానమంతా ఏగంగలో కలిసిపోయింది? రచయితనని చెప్పుకోవడానికే సిగ్గుగా వుంది.

ఎంతో నీట్‌గా నటించి నా బ్రీఫ్‌కేసు కాజేసిన సిల్కులాల్చీ అతణ్ణి పొరపాటునకూడా అనుమానించ లేకపోయాను. అతని పై మెరుగులను చూసి పెద్దమనిషి అనుకున్నాను. అతనిమాటలకు మంత్రముగ్ధుణ్ణయ్యాను. అతను కల్పించి చెప్పిన కథలన్నీ గుడ్డిగా నమ్మాను. కానీ, అతని అంతరంగంలో దాగివున్న మోసాన్ని మాత్రం చూడలేకపోయాను

అవినీతి, అన్యాయం ఈ లోకంలో ఇంకా ఎన్నెన్ని రూపాల్లో వున్నాయో? ......అవి ధరించే రూపాలు ఒక్కొ విధంగా వుండబట్టే బట్టకట్టి బయటపడుతున్నాయోమో!

మనసుకి అడ్డంగా కట్టుకున్న చీకటి తెరల్ని తొలగిస్తే గాని నిజం బయటపడదు కానీ, ఆ తెరలు అంత తేలికగా తొలిగేవీ కావు; నిజాలు అంత త్వరగా బయటపడేవీకావు. అదే సాధ్యమయితే ఈరోజున నేను ఇంత తెలివితక్కువగా బోల్తాపడేవాడిని కాదు. అవినీతి, అన్యాయం ఇంత విచ్చలవిడిగా తిరిగేవీకావు.

రైలు వాల్తేరు చేరింది. ఆలోచనల నుండి తేరుకుని దీర్ఘంగా నిట్టూర్చాను. నా చెయ్యి అప్రయత్నంగా జేబులోకి వెళ్ళింది. నవ్యసాహితీ వారు బహుకరించిన నూటపదహారు రూపాయలు పైకి తీశాను. మరో ఆలోచనకు తావు ఇవ్వకుండా ఆడబ్బు అతనిచేతిలోపెట్టి బండి దిగిపోయాను. అప్పుడు గాని నామనసు తేలికపడలేదు.

బ్రీఫ్‌కేసు పోయినందుకు బాధపడలేదు. అందులో అంతగా ఖరీదుచేసే వస్తువులు ఏవీలేవు. నాకున్న వస్తువుల్లో అన్నిటికన్నా విలువైనదిగా ఎంచిన శాలువ పోయినందుకు కూడా నేను ఆ క్షణాన ఎలాంటి బాధపడలేదు. నిజానికి ఆ శాలువ పొందే అర్హత నాకు లేదు. అంత ఎత్తుకు ఎదగడానికి నేను ఇంకా ఎంతో జీవితానుభవం గడించాల్సి వుంది.